సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్‌గా భవభూతి



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్‌గా డి. భవభూతి గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రఘు బదిలీపై హైదరాబాద్ హెడ్ ఆఫీస్‌కు వెళ్లగా, హకీంపేట డిపోలో పనిచేస్తున్న భవభూతి ఇక్కడికి వచ్చారు. బదిలీపై వెళ్లిన రఘును ఆర్టీసీ కార్మికులు ఘనంగా సన్మానించారు.

క్యాన్సర్‌పై అవగాహన తప్పనిసరి

గజ్వేల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై అవగాహన అవసరమని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్. గణపతిరావు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఎన్ని రకాల క్యాన్సర్లు ఉన్నాయి, వాటి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు మొదలైన విషయాలపై విద్యార్థులకు కూలంకషమైన అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూచారంలో సెక్యూరిటీ జాబ్ చేస్తున్నా



నా పేరు రాఘవరెడ్డి... నా భార్య పేరు ప్రమీల. మాకు ఓ కొడుకు, ఓ కూతురు. కుమార్తెను ఊర్లోనే ఇచ్చాం. వాళ్లు ప్రస్తుతం ఉప్పల్‌లో నివాసం ఉంటున్నారు. కుమారుడికి పెళ్లి చేశాం. పెళ్లి అయిన తర్వాత నా భార్య ప్రమీలకు, నా కోడలుకు పడలేదు. కొన్ని రోజుల క్రితమే మాకున్న ఐదెకరాల భూమిని కుమారుడి పేరున రాసిచ్చాం. ఇప్పుడు మమ్మల్ని చూడడం లేదు. వాళ్లింట్లో ఫంక్షన్ అయితే కూడా నా భార్యను పిలవలేదు. నా భార్యకు షుగర్, బీపీ ఉంది. మేం ఎలా బతకాలో అర్థం కాక మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కూచారంలో ఓ పరిశ్రమ వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నా. వచ్చిన డబ్బులతో నా భార్యకు మందులు కొంటూ పూట ఎల్లదీస్తున్నాం. అప్పుడప్పుడు నా కూతురు వచ్చి మంచి చెడు చూస్తుంది. నా కొడుకు రావట్లేదు. ఈ విషయం సిద్దిపేట ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే ఆర్డీవోకు ఈ విషయాన్ని చెప్పడంతో ఇక్కడికి వస్తున్నాం. ముసలితనంలో కష్టపడుతూ బతుకీడుస్తున్నా. అధికారులైనా న్యాయం చేసి నా కుమారుడు నన్ను, నా భార్యను చూసేలా చేస్తారని భావిస్తున్నా.

- గొర్రె రాఘవరెడ్డి, మంతూరు, రాయపోల్ మండలం

బువ్వ పెట్టే దిక్కులేదు..



నా భార్య కొన్నాళ్ల క్రితం చనిపోయింది. ఒక్కగానొక్క కుమార్తె కూడా చనిపోవడంతో బువ్వ పెట్టే దిక్కులేకుండా పోయింది. కుమార్తెకు ముగ్గురు కుమారులు.. మనుమలకు నాకున్న పది ఎకరాల భూమిని రాసిచ్చా. భూమిని తీసుకున్న అల్లుడు, మనుమలు నా బాగోగులు చూడడం లేదు. పరిస్థితి మారింది. ప్రస్తుతం తీవ్ర అనారోగ్యానికి గురైనా వీల్‌ఛైర్‌పై గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుంది.

- చిన్నమ్మగారి ఎల్లారెడ్డి, దిలాల్‌పూర్


20 ఎకరాల భూమి ఇస్తే.. ఇంట్లోంచి పంపించేశారు



నేను, నా భర్త సంపాదించిన పదెకరాల భూమితో పాటు మాకు అనువంశికంగా వచ్చిన పది ఎకరాలు... మొత్తం 20 ఎకరాల భూమిని మా ఇద్దరు కుమారులకు ఇస్తే ఇప్పుడు వారు కనీసం బువ్వ పెట్టడం లేదు. కొన్నాళ్ల క్రితమే భూమిని కుమారులకు ఇవ్వడంతో నన్ను ఇంట్లో నుంచి బయటకు పంపించేశారు. బువ్వ పెట్టకపోవడంతో కుమార్తె దగ్గరకు వెళ్తే తిడుతున్నారు.

- నర్సమ్మ, మంతూరు, రాయపోల్ మండలం

పస్తుల్లో పండుటాకులు



- బుక్కెడు బువ్వ కోసం అవస్థలు
- పిల్లలకు ఆస్తులు రాసివ్వగానే భారమవుతున్న తల్లిదండ్రులు
- జిల్లాలో 170 మంది వృద్ధుల ఆవేదన
- చట్టాలపై అవగాహన కరువు
- న్యాయం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

"తమ పిల్లలు ఎదిగి ఉన్నత స్థితికి చేరుకోవాలని తల్లిదండ్రులు ఆశపడ్డారు.. కాయకష్టం చేసి పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దారు. చివరి దశలో అదే పిల్లలు బుక్కెడు బువ్వ పెట్టేందుకు ఇష్టపడడం లేదు. తమ చెమటతో కట్టుకున్న ఇల్లు, పొలాలు, ఆస్తులు తమ పిల్లల పేర్లకు బదిలీ అవ్వగానే.. పండుటాకులకు కష్టాలు మొదలవుతున్నాయి. ఆస్తి రాసి మనసు కోల్పోయిన వృద్ధుల సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతోంది. చిన్నతనం నుంచి కష్టపడి పెంచి, పిల్లలపై ఆధారపడే వయస్సు వచ్చేసరికి పస్తులతో పండుటాకుల్లా మాడిపోతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ప్రజావాణి, డివిజన్ స్థాయిలో కార్యాలయాల్లో దరఖాస్తులు చేస్తూ, పేషీలకు హాజరవుతున్నారు.

- గజ్వేల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని గజ్వేల్, సిద్దిపేట, హుస్నాబాద్‌లలో దాదాపు 170 మంది వృద్ధ తల్లిదండ్రులు తమ ఆస్తులను పిల్లలకు రాసిచ్చి, పిల్లలు గెంటేయడంతో తమ బాగోగులు ఎట్లా అంటూ ఆవేదనతో బతుకీడుస్తున్నారు. తల్లిదండ్రుల సంరక్షణ, పోషణకు సంబంధించిన పలు చట్టాలు ఉన్నప్పటికీ అవగాహన కరువవడంతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. హిందూ దత్తత, పోషణ చట్టం 1956 ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే. పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలపై ఉన్న ప్రేమతో కేసులు వేయడం లేదు. దీంతో వేగవంతమైన సహాయాన్ని అందించేందుకు న్యాయస్థానాలతో సంబంధం లేకుండా

మిగతా 6వ పేజీలో



చిన్నకోడూరు హైస్కూల్‌లో సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

తనిఖీలకు ఉపాధ్యాయులు వద్దు

చిన్నకోడూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధి కోసం రాష్ట్రవ్యాప్తంగా 24,246 ప్రభుత్వ పాఠశాలల్లో 1473 మంది ఉపాధ్యాయులతో 299 కమిటీలు ఏర్పాటు చేసి పర్యవేక్షించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లోని పాఠశాలల్లో గురువారం టీపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో సమస్యల సేకరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉమ్మడి సర్వీసు రూల్స్‌ను అమలుచేసి, ఖాళీగా ఉన్న మండల విద్యాధికారులు, జిల్లా ఉప విద్యాధికారుల పోస్టులను భర్తీ చేసి, వారి ద్వారా పాఠశాల పర్యవేక్షణ చేయాలన్నారు. ఉపాధ్యాయుల ద్వారా పర్యవేక్షణ చేయడం సరికాదని అన్నారు. ఇలా చేయడం వల్ల విద్యాబోధనకు ఆటంకం కలుగుతుందని తెలిపారు. పెండింగ్ బిల్లుల విషయంలో ప్రభుత్వం మాట తప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 5 వేల ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేసి, ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ జానకిరాములు, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, జిల్లా కార్యదర్శి శివాజీ, మండలాధ్యక్షుడు మహేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి దేవ ఋషి, నాయకులు శ్రీనివాస్, వేణు నరేష్, ప్రవీణ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో ఇబ్బందులు రాకూడదు

- జిల్లాలో 439 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- సేకరణ లక్ష్యం 6 లక్షల మెట్రిక్ టన్నులు : కలెక్టర్ హైమావతి



మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

సిద్దిపేటకల్చరల్/హుస్నాబాద్‌రూరల్/హుస్నాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్- 2025, 26 సీజన్ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రక్రియ సజావుగా జరిగేలా మిల్లర్లు, అధికారులు పనిచేయాలని కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు, జిల్లా సివిల్ సప్లయ్, డీఆర్‌డీవో అధికారులతో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సివిల్ సప్లయ్ శాఖ అందించిన మార్గదర్శకాల ప్రకారం చేపట్టాలని అధికారులకు, మిల్లర్ ప్రతినిధులకు సూచించారు. ఈ సీజన్‌లో 6 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. జిల్లాలో మొత్తం 439 ధాన్యం సెంటర్‌లలో ఇప్పటివరకు 239 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని పేర్కొన్నారు. ధాన్యం మళ్లింపులకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థుల పట్ల శ్రద్ధ అవసరం

సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ హైమావతి పేర్కొన్నారు. గురువారం హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ సాంఘిక సంక్షేమశాఖ గురుకుల బాలుర పాఠశాలను ఆర్డీవో రామ్మూర్తితో కలిసి సందర్శించారు. విద్యార్థి సనాదుల వివేక్ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. విద్యార్థి మృతి ఘటన వివరాలు పోలీసుల విచారణలో తేలుతాయన్నారు. పాఠశాల ప్రాంగణం బయట, లోపల సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలని సూచించారు.

వివేక్ మృతిపై నిజాలు బయటపెట్టాలి

విద్యార్థి వివేక్ మృతిపై నిజాలను బయటపెట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం హుస్నాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో మాల మహానాడు, దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. దాదాపు గంట పాటు ఆందోళన చేశారు. విద్యార్థి మృతిపై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రమాదవశాత్తు జరిగిందని పేర్కొనడం సరికాదని, ఈ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ఉద్యోగం ఇప్పించాలని కోరారు. ఆందోళన చేపట్టిన వారిలో విద్యార్థి తల్లిదండ్రులు సత్యనారాయణ, జాతీయ మాల మహానాడు రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ ఎలక దేవయ్య, హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆరె కిశోర్, బొజ్జ హరీశ్, కొంకటి పరశరాములు, మంకాల రమేశ్, యాదగిరి, సాయి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.





అర్ధరాత్రి వర్షం... తడిసిన ధాన్యం

నంగునూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలు రైతులను అతలాకుతలం చేస్తున్నాయి. బుధవారం అర్ధరాత్రి తర్వాత కురిసిన వర్షంతో ధాన్యం తడిసి ముద్దయింది. నంగునూరు మండలం కొండంరాజుపల్లి, గట్లమల్యాల, ఖతా, ఘనపూర్, అక్కేనపల్లి గ్రామాల్లో కురిసిన వర్షానికి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గట్ల మల్యాల కొనుగోలు కేంద్రంలో రాత్రికి రాత్రే ధాన్యం తడిచిపోవడంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. కొనుగోలు కేంద్రం ప్రారంభించినా, సంచులు రాకపోవడంతో కొనుగోలు ప్రక్రియ జరగడం లేదు.



మక్కల కొనుగోలుకు గ్రీన్‌సిగ్నల్

- 28,643 ఎకరాల్లో పంట సాగు
- జిల్లాలో 9 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- రెండు రోజుల్లో ప్రారంభం

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న రైతులకు కాస్త ఊరట కలిగించే విషయం.. 2,400 మద్దతు ధరతో మక్కల కొనుగోలుకు ప్రభుత్వం ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జిల్లాల్లో రెండు రోజుల్లో కేం ద్రాలు ప్రారంభం కానున్నాయి. మొన్నటి వరకు క్వింటాల్‌కు రూ. 2500 పలికిన ధర.. ప్రస్తుతం రూ.1800 పడిపోవడంతో రైతులు తీవ్రఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో మద్దతు ధర రూ. 2500 చొప్పున కొనుగోలు చేయాలని రైతులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సైతం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో కూడా కొనుగోలు కేంద్రాల ప్రారంభమెపుడో? శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాకు రూ.2400 మద్దతు ధరతో మక్కలు కొనేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మరో రెండు రోజుల్లో కొనుగోళ్లు ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసింది. సిద్దిపేట, గజ్వేల్, చేర్యాల, చిన్నకోడూరు, నంగునూరు, కోహెడ, బెజ్జంకి, హుస్నాబాద్, తొగుట మండలంలోని కానుగల్‌లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

70వేల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా

జిల్లాలో వరి, పత్తి తరువాత అధికంగా సాగు చేసే పంట మొక్కజొన్నే. ఈ సీజన్‌లో 28,643 ఎకరాల్లో మొక్కజొన్నను రైతులు సాగు చేశారు. 70 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి రానున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు పంటను మొత్తం కొనుగోలు చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. పంట కోతలు మొదలై మూడు వారాలు దాటింది. అయితే, కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం కారణంగా రైతులు ఇప్పటికే కొంత పంటను ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో, తాజాగా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుండడంతో, ఇంకా పంట చేతిలో ఉన్న రైతులు తమకు మద్దతు ధర దక్కనుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలో తొమ్మిది మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. రెండు రోజులలో అన్ని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోలు చేస్తాం. మొక్కజొన్న సాగు చేసిన రైతులు తమ పంటను కేంద్రాల్లోనే మద్దతు ధరతో అమ్ముకోవాలి.

- క్రాంతి, మార్క్‌ఫెడ్ డీఎం

దౌల్తాబాద్‌కు దళారులే దిక్కా?

- మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయని సర్కారు

6

అందరి అభిప్రాయం మేరకే అధ్యక్షుడి నియామకం

- ఏఐసీసీ అబ్జర్వర్ జ్యోతి రౌటేల
- సిద్దిపేటలో ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

సిద్దిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కింది స్థాయి కార్యకర్త నుంచి ప్రజల మధ్య ఉంటూ సేవలందిస్తున్న నాయకుడినే, అందరి అభిప్రాయం మేరకు సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా నియమిస్తామని ఏఐసీసీ అబ్జర్వర్ జ్యోతి రౌటేల తెలిపారు. గురువారం సిద్దిపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నూతన డీసీసీ అధ్యక్ష పీఠం కోసం సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల నుంచి ఏఐసీసీ అబ్జర్వర్ జ్యోతి రౌటేలాతో పాటు మరో నలుగురు అబ్జర్వర్లు జగదీశ్‌రావు, నిజాంఅహ్మద్, చొప్పదండి ఎమ్మెల్యే సత్యం, వరలక్ష్మి ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ అబ్జర్వర్ జ్యోతి రౌటేలా మాట్లాడారు. జిల్లాల్లో డీసీసీలను నియమించి, పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్నామని, తద్వారా రాబోయే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడైతే కాంగ్రెస్ అధికారంలో ఉందో అక్కడ ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా చూస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లేనిచోట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని చెప్పారు. ఆశావహుల నుంచి సేకరించిన దరఖాస్తులను పరిశీలించి, వాటిలో నుంచి అర్హత, నిబంధనల మేరకు వచ్చిన దరఖాస్తుల నుంచి పీసీసీ అభిప్రాయ సూచన మేరకు పేర్లను షార్ట్‌లిస్ట్ చేసి అధిష్ఠానానికి అందజేస్తామన్నారు. అనంతరం చొప్పదండి ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ గత ప్రభుత్వాలు అనుసరించిన నియంత పోకడలపై రానున్న రోజుల్లో ఎండగడుతామని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ పతనమయ్యేలా, బీజేపీ గద్దె కూల్చుతామని చెప్పారు. కార్యక్రమంలో సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, ఆర్‌టీఏ సభ్యుడు సూర్యవర్మ, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం, నాయకులు బొమ్మల యాదగిరి, కలీమొద్దీన్, సాకి ఆనంద్, గోపికృష్ణ, ముద్దం లక్ష్మి, గయాసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ అబ్జర్వర్ జ్యోతి రౌటేల

ఆకట్టుకున్న ఎకోబజార్

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో (జాతీయ సేవా పథకం) ఎన్ఎస్ఎస్ 7 యూనిట్లు, ఎకో క్లబ్ ఆధ్వర్యంలో ఎకో బజార్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 28 స్టాల్స్‌ను ప్రదర్శించారు. పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్, వ్యాసరచన పోటీలు ప్రకృతి-సంస్కృతి అంశం మీద నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది విద్యార్థుల బాధ్యత అని అన్నారు. పర్యావరణం, ఎకో ఫ్రెండ్లీ యాక్టివిటీస్, పర్యావరణానికి సంబంధించిన ఎగ్జిబిట్స్ స్టాల్స్ నిర్వహించడంలో విద్యార్థుల పాత్రను అభినందించారు. ప్లాస్టిక్‌తో సంబంధించిన వాటిని వాడకూడదని ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అయోధ్య రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ గోపాల సుదర్శన్, ఎన్ఎస్ఎస్ యూనిట్ల ప్రోగ్రామ్ ఆఫీసర్లు జి.బాలకిషన్, డాక్టర్ ఎస్.హరిబాబు, డాక్టర్ మట్టా సంపత్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ శైలజ, డాక్టర్ మహేష్‌కుమార్, విశ్వనాథం, డాక్టర్ పుణ్యమ్మ, ఎకోక్లబ్ కన్వీనర్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, జడ్జిలుగా మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ మదన్మోహన్, బయోటెక్నాలజీ విభాగాధిపతి రోహిణి, రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్, ఎకోక్లబ్ ఆధ్వర్యంలో ఎకోబజార్



నేషనల్ గ్రీన్‌కార్ప్స్ ఆధ్వర్యంలో..

నేషనల్ గ్రీన్‌కార్ప్స్ఆధ్వర్యంలో...

నేషనల్ గ్రీన్ కార్ప్స్ వారి సహకారంతో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో క్యాంపస్ ఎకో బజార్, ఎకో ఫ్రెండ్లీ ఉత్పత్తుల ప్రదర్శనను సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. పర్యావరణ స్నేహిత ఉత్పత్తులపై అవగాహన కల్పించారు.

మంత్రి పొన్నం చనిపోయారని దుష్ప్రచారం

●బీఆర్ఎస్ నాయకురాలిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుస్నాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చనిపోయారని దుష్ప్రచారం చేస్తున్నారు. దుష్ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకురాలు చింతల గీతారెడ్డిపై చర్యలు తీసుకోవాలని గురువారం హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసినవారిలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు బంక చందు, చిత్తారి రవీందర్, రాజిరెడ్డి, చిత్తారి పద్మ, వీరన్న గంపల శ్రీనివాస్ తదితరులుఉన్నారు.

కాబోయే భర్త ఆత్మహత్య చేసుకున్నాడని యువతి బలవన్మరణం

రామచంద్రాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కాబోయే భర్త ఆత్మహత్య చేసుకున్నాడన్న మనస్తాపంతో కాబోయే భార్య ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై రమేష్ వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం గుల్బార్గాకు చెందిన షేక్ హబీబ్, షబేబా బేగంలు కుటుంబంతో సహా నగరంలోని కాటేదాన్‌కు వలస వచ్చారు. ఇళ్లు లేని వీరు ఇంటి కోసం దరఖాస్తు చేసుకోవడంతో కొల్లూరు డబుల్ బెడ్ రూంలో ఇల్లు వచ్చింది. ఈ మధ్యకాలంలో కొల్లూరు ఇంట్లోకి మకాం మార్చారు. ఆరునెలల క్రితం గుల్బార్గాకు చెందిన మహబూబ్‌తో ఆసియా ఫర్విన్(19)కు నిశ్చితార్థం జరిగింది. 15 రోజుల క్రితం మహబూబ్ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆసియా ఫర్విన్ కాటదాన్‌లోని కళాశాలకు వెళ్లకుండా ఇంట్లో దిగాలుగా కూర్చొంటోంది. బుధవారం తల్లి పక్కంటికి, తండ్రి నమాజ్‌కు వెళ్లారు. ఇదే సమయంలో ఆసియా ఫర్విన్ బెడ్‌రూంలోకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై రమేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి సంస్థ, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా నిర్మూలన అనే అంశంపై జిల్లాలోని వివిధ పాఠశాలలకు సంబంధించిన స్కూల్ అసిస్టెంట్ అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మానవ అక్రమ రవాణ, లైంగిక వ్యాపారం ఎలా జరుగుతుంది, బాధితురాలి పైన ఉండే ప్రభావాలు, సైబర్ ఆధారిత అక్రమ రవాణా, చట్టాలు బీఎన్ఎస్, ఐటీపీఏ, పోక్సో, పీసీ ఎంఏ చట్టాలు, సఖీ, భరోసా, చైల్డ్‌లైన్, పోలీస్ టోల్ ఫ్రీ నెంబర్స్ 1098, 100, 181, 1930, 181 గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యా శాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ ముంద్రాతి రమేష్ మాట్లాడుతూ.. మనుషుల అక్రమ రవాణా నిర్మూలనలో ప్రజలు అందరు భాగస్వామ్యం అయినపుడే దీనిని సమూలంగా నివారించవచ్చు అని అన్నారు. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరితమైన చర్య అని ఆందోళన వ్యక్తం చేశారు.



శిక్షణకు హాజరైన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు

విద్యార్థులకు అవగాహన కల్పించాలి

పేద, మధ్య తరగతి అమ్మాయిలు, మహిళలు ఎక్కువగా అక్రమ రవాణా బారినపడుతున్నారన్నారు. ముఖ్యంగా పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్స్‌లో అవగాహనా కల్పించాలని చెప్పారు.

సమాజంలో ఉన్న చాలా సమస్యలకు ఆర్థిక కారణాలతోపాటు, సామజిక కారణాలు దోహదం చేస్తాయని, అలాంటి వాళ్లను ట్రాఫికెర్స్ టార్గెట్ చేసి, మాయమాటలు, ఉద్యోగం, సినిమా అవకాశం అంటూ పట్టణాలకు తీసుకెళ్లి వ్యభిచార గృహాలలో అమ్ముతున్నారన్నారు. జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు అందరు అవగాహనా కలిగి ఉండి, అప్రమత్తం చేయడం ద్వారా దీన్ని నిర్మూలించవచ్చు అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ అసిస్టెంట్ కోఆర్డినేటర్ మిథాలీ రాజ్ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణాను ఆదిలోనే అడ్డుకుంటే మన ఆడపిల్లలను రక్షించుకోవచ్చన్నారు. ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు దీని బారిన పడుతున్నారన్నారు. ముఖ్యంగా యువత, పిల్లలు ఆకర్షణలకు లోనై పట్టణాలకు వచ్చి వ్యభిచార గృహాలలో మగ్గుతున్నారన్నారు. ప్రజ్వల సంస్థ ద్వారా ఇప్పటి వరకు 30, 500 వేల మంది అమ్మాయిలను మహిళలను కాపాడినట్లు చెప్పారు. అనవసరమైన ఆప్స్ ద్వారా పర్సనల్ ఫొటోస్ వీడియోస్ పంపడం వల్ల ట్రాఫికింగ్‌కి గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలి

మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు



పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు

చేగుంట ,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి నేరాలను పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా కృషి చేయాలని సిబ్బందికి మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. నార్సింగి పోలీస్ స్టేషన్‌ను గురువారం సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం నార్సింగి శివారులోని ఫైర్ రేంజ్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరించి వారికి న్యాయం జరిగే విధంగా సిబ్బంది చూడాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కారంకు కృషి చేయాలి అన్నారు. ప్రజల్లో నమ్మకం పెంచే విధంగా పోలీసులు శాఖ తరఫున గ్రామాల్లో మూఢనమ్మకాలు, సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, ఆన్లైన్ మోసాలపై ప్రజలకు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండే విధంగా వివిధ కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. సివిల్ కోర్టు కేసుల్లో భూ వివాదాల్లో పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించవద్దన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్లో క్రైమ్ రికార్డులను పరిశీలించారు.

పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలి : టీపీటీఎఫ్

మర్కుక్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీని అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజయ్య అన్నారు. గురువారం జగదేవ్‌పూర్ మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి సమస్యల సేకరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జగదేవ్‌పూర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్తయ్య, పోచయ్య, గజ్వేల్ జోన్ కన్వీనర్ శ్రీనివాస్, జిల్లా కౌన్సిలర్ శంకర్, జలంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేయిస్తున్న టీపీటీ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజయ్య

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

●మంజీరలో దూకి యువకుడి..



జగన్ (ఫైల్)

సంగారెడ్డి క్రైం/నారాయణఖేడ్// జోగిపేట రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వేర్వేరు కారణాలతో వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వ్యక్తిగత కారణాలతో ఓయువకుడు మంజీరా నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని చింతకుంట శివారులో గురువారం చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని రోళ్లపహాడ్‌కు చెందిన జగన్ (17) అనే యువకుడు వ్యక్తిగత కారణాలతో గురువారం మధ్యాహ్నం చింతకుంట గ్రామ శివారులోని మంజీర నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

కుటుంబ కలహాలతో ఒకరు..



ఆత్మహత్యకు పాల్పడిన రాజశేఖర్

కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి మండలం సదాశివనగర్‌కు చెందిన మన్నె రాజశేఖర్ (39) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. అతడికి ఏడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కానీ సంతానం కలుగలేదు. భార్యతో కొన్ని రోజులుగా గొడవలు జరిగేవి. తీవ్ర మనస్తాపానికి గురైన రాజశేఖర్‌రెడ్డి తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

ఉద్యోగి ఆత్మహత్య



చాకలి సంగయ్య (ఫైల్)

మద్యం మత్తులో భార్యతో గొడవ పడి పురపాలక హౌట్‌సోర్సింగ్ ఉద్యోగి ఒకరు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నారాయణఖేడ్‌లో గురువారం వెలుగు చూసింది. స్థానిక ఎస్సై రాసుల శ్రీశైలం కథనం ప్రకారం.. నారాయణఖేడ్ పట్టణానికి చెందిన చాకలి సంగయ్య (57) అనే వ్యక్తి నారాయణఖేడ్‌లోని పురపాలకలో హౌట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. సంగయ్యకు మద్యం తాగే అలవాటు ఉండటంతో బుధవారం రాత్రి మద్యం తాగిన మైకంలో కుటుంబికులతో, భార్యతో గొడవపడ్డాడు. గొడవ ఎందుకు చేస్తున్నావని భార్య ప్రశ్నించడంతో క్షణికావేశానికి గురయిన సంగయ్య పట్టణంలోని ఆక్సీజన్‌పార్కు వద్దకు వెళ్లి అక్కడ ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య చాకలి అంజమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మానసిక స్థితి బాగోలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నం

● కాపాడిన పోలీసులు

నర్సాపూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలోని సునీతాలక్ష్మారెడ్డి కాలనీలో నివాసముండే సతీష్ అనే వ్యక్తి మానసిక స్థితి బాగా లేకపోవడంతో గురువారం కత్తితో మెడను కోసుకుని ఆత్మహత్యయత్నం చేసుకున్నాడు. ఈ విషయం స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమివ్వడంతో అక్కడకు వెళ్లి ఆయనను వెంటనే నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేయించడంతో ప్రాణపాయం నుండి బయటపడ్డాడు.

రైలు ఢీకొని యువకుడి మృతి

మాసాయిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మాసాయిపేటలోని శ్రీనివాస నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో బైనూర్ చెరువు వద్ద గురువారం సాయంత్రం రైలు ఢీకొని మృతి చెందాడు. కామారెడ్డి రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ హనుమాన్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో నిజామాబాద్ వైపు వెళ్తున్న ప్యాసింజర్ రైలు గుర్తు తెలియని యువకుడు పట్టాలు దాటుతుండగా వేగంగా రైలు ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కామరెడ్డి పోలీసులు తెలిపారు

చెరువులో పడి వ్యక్తి..

టేక్మాల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన టేక్మాల్ మండలం పల్వంచ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాయికోటి కృష్ణ (32) వ్యవసాయంతో పాటు కూలి పనులు చేసుకుంటూ చేపలు పడుతుంటాడు. గురువారం చెరువు వద్దకు వెళ్లిన అతడు ప్రమాదవశాత్తు చెరువులో పడి గల్లంతయ్యాడు. దీంతో అతడి కోసం నాలుగు గంటల పాటు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం అతడి మృతదేహం లభ్యమైనట్లు గ్రామస్తులు చెప్పారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బైక్ పైనుంచి జారి పడి మహిళ మృతి



పుష్పలత (ఫైల్)

వట్‌పల్లి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బైక్ పైనుంచి జారిపడి మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నాగులపల్లి శివారులో చోటుచేసుకుంది. ఎస్సై లవకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రైకోడ్ మండలం ఎనికేపల్లి గ్రామానికి చెందిన పడకంటి పుష్పలత(32)భర్త శివకుమార్ కుమార్తె శ్రీవల్లితో కలిసి బైక్ పై ఆందోలు గురుకుల పాఠశాలకు వెళుతున్నారు. మార్గమధ్యంలో నాగులపల్లి శివారులో పుష్పలత బైక్‌పై నుంచి కింద జారి పడింది. దీంతో తీవ్ర గాయాలైన ఆమెను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. భర్త శివకుమార్ ఫిర్యాదు మెరుపు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు

ఉపాధ్యాయుడిని బెదిరించి డబ్బు వసూల్

నర్సాపూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయుడిని కత్తితో బెదిరించి తన వద్ద ఉన్న డబ్బులు తీసుకుని ఉడాయించిన వైనం గురువారం సాయంత్రం నర్సాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదల మండలం అన్నారంకు చెందిన కిష్టయ్య అనే ఉపాధ్యాయుడు నర్సాపూర్ మండలంలోని మంతూరులో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం తహసీల్దార్ కార్యాలయంలో పని ఉండగా అక్కడకు వెళ్లి సాయంత్రం తిరిగి వెళ్లడానికి కొల్చారంలో ఆటో ఎక్కాడు. ఆటో నర్సాపూర్ ప్రధాన చౌరస్తా వరకు వచ్చాక అన్నారం వైపు వెళ్లాల్సి ఉండగా డ్రైవర్ ఆటోను తూప్రాన్ వైపు మళ్లించి నర్సాపూర్ పట్టణ సమీపంలోని గ్యాస్ గోదాం సమీపంలో ఉన్న ఓ కుంటలోనికి ఆటోను తీసుకెళ్లాడు. ఉపాధ్యాయుడిని కత్తితో బెదిరించి అతడిపై దాడి చేసి ఫోన్‌తో పాటు పర్సు తీసుకుని అక్కడే వదిలేసి వెళ్లాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే పర్సులో 12వందల రూపాయలతో పాటు పలు కార్డులున్నాయని తెలిపారు.

అనుమానాస్పద వ్యక్తుల బైండోవర్



లద్నూరులో అనుమానాస్పదంగా సంచరిస్తున్నవారిని విచారిస్తున్న ఎస్సై

మద్దూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలం లద్నూరులో పాత ఇనుప సామాను కొంటామని అనుమానాస్పందంగా సంచరిస్తున్న ఇద్దరి వ్యక్తులను అదుపులోకి తీసుకుని తహసీల్దారు ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై షేక్ మహబూబ్ అలీ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు లద్నూరు గ్రామంలో గురువారం పాత ఇనుప సామాను కొంటామని ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు గ్రామస్తులు 100కి కాల్ చేశారు. సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకుగా జనగామ జిల్లా తరిగొప్పుల మండల కేంద్రానికి చెందిన పడతం ఆనందం, పడుతం శ్రీనివాస్ బుడిగ జంగాలు అని తెలిపారు. వీరిని తహసీల్దారు ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

మేఘనకు కన్నీటి వీడ్కోలు

కన్నీటి పర్యంతమైన విద్యార్థులు ఉపాధ్యాయులు

కుకునూరుపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వారం క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మేఘన అనే విద్యార్థి బుధవారం రాత్రి మృతి చెందింది. కుకునూరుపల్లి బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మల్లం ఐలయ్య కుమార్తె అయిన మేఘన గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నది. గతవారం పాఠశాలకి వెళ్లే గ్రామంలో బైక్ ఢీకొని తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. ఉదయం తోటి విద్యార్థులు ర్యాలీ నిర్వహించి అనంతరం అంతిమయాత్రలో పాల్గొని కన్నీటి పర్యంతమయ్యారు. గజ్వేల్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ప్రతాప్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పాఠశాల వద్ద స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని లేదా ప్రమాదాలు జరగకుండా ఇతర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు

వేలూరు ఆత్మహత్యల గోస పుస్తకావిష్కరణ



పులి రాజు రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ వీరేందర్

గజ్వేల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఏటిగడ్డ కిష్టాపూర్ వాసి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, రైతునేస్తం అవార్డు గ్రహీత పులిరాజు రచించిన వేలూరు ఆత్మహత్యల గోస పుస్తకాన్ని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ వీరేందర్ ఆవిష్కరించారు. గురువారం గజ్వేల్ పరిధిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్గిల్ యుద్ధ వ్యూహకర్త డాక్టర్ జీజే రావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పెద్ది రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, టీపీటీఎఫ్ మాజీ అధ్యక్షుడు రాంచంద్రం, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మల్లికార్జున్, బీజేపీ నాయకులు మనోహర్‌యాదవ్, సందీప్, నరసింహ, శివకుమార్, వెంకట్‌రెడ్డి, యాదమల్లు, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు నర్సాపూర్ గురుకుల విద్యార్థిని

కౌడిపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అండర్-14 రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కౌడిపల్లి మండల పరిధిలోని సదాశివపల్లి గ్రామానికి చెందిన చెప్యాల వందన ఎంపికైంది. ఈ నెల 26న సంగారెడ్డి జిల్లాలోని శంకర్‌పల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొననున్నదని నర్సాపూర్‌లోని శ్రీవత్సల్ గురుకుల పాఠశాల చైర్మన్ సతీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపారు. స్వామి వివేకానంద స్కూల్ ఆఫ్ యోగా రంగారెడ్డి జిల్లా అసోసియేషన్, తెలంగాణ రంగారెడ్డి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్తంగా హైదరాబాద్‌లో ఆగస్టులో యోగా పోటీలను నిర్వహించాయని, శ్రీవత్సల్ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న చెప్యాల వందన ఈ పోటీల్లో గెలుపొంది సిల్వర్ మెడల్‌ను దక్కించుకుందని పేర్కొన్నారు. వందనను ప్రిన్సిపాల్ బాలజ్యోతితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

'ఖేలో ఉత్సవ్' చెస్ రాష్ట్రస్థాయి పోటీల్లో సంయుక్త స్కూల్ విద్యార్థికి ద్వితీయ స్థానం



చెస్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఈశాన్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కొండాపూర్ మండల పరిధిలోని సంయుక్త ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి కె.ఈశాన్ చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో గురువారం జరిగిన రాష్ట్రస్థాయి ఖేలో ఉత్సవ్ ఛాంపియన్‌షిప్ - 2025లో అతను ద్వితీయ స్థానంలో నిలిచాడు. చెస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థి ఈశాన్‌ను పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జగదేవ్‌పూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థినులు ఎంపిక

వాలీబాల్‌లోనూ మెరిసిన బాలికలు



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జగదేవ్‌పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జగదేవ్‌పూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ స్లీవరాజ్ తెలిపారు. ఈ నెల 13న సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని మైత్రి క్రికెట్ క్లబ్ మైదానంలో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా కబడ్డీ పోటీల్లో సిద్దిపేట జిల్లా తరపున పాల్గొన్న జగదేవ్‌పూర్ ఆదర్శ పాఠశాల 8వ తరగతి విద్యార్థినులు ఆర్.చందన, ఎం.డి.జీనత్ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలోనూ మంచి ప్రదర్శన చూపించి జాతీయస్థాయికి ఎంపికయ్యే విధంగా వారికి శిక్షణ ఇవ్వాలని పీడీ అనంతరాములు చారికి ప్రిన్సిపాల్ సూచించారు. ఈ నెల 14న ప్రజ్ఞాపూర్ బాయ్స్ హైస్కూల్‌లో నిర్వహించిన అండర్-14 బాలికల వాలీబాల్ ఉమ్మడి మెదక్ జిల్లా పోటీల్లో సిద్దిపేట జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ క్రీడలలో జగదేవ్‌పూర్ ఆదర్శ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు ఎ.అనూష, ఆర్.సిరి పాల్గొని పతకాలను అందుకున్నారు. విద్యార్థినులను, పీడీ అనంతరాములు చారిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల బృందం వారిని అభినందించింది.

సైలెన్సర్ల మోత.. రోలర్‌తో వాత

గతేడాది జూలైలో సౌండ్ పొల్యూషన్‌కు కారణమైన దాదాపు 72 బైక్‌లను పోలీసులు సీజ్ చేశారు. వాటి సైలెన్సర్లను తొలగించి, సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపినా, ప్రజలకు ఇబ్బందులు కలిగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినా సంగారెడ్డి జిల్లాలో కొందరు ఆకతాయి యువకుల ఆగడాలకు అంతులేకుండా పోయింది. లక్షల రూపాయల విలువైన బైక్‌లు కొనుగోలు చేసి వాటి సైలెన్సర్లను మార్పిడి చేస్తూ, అతివేగంతో నడుపుతూ కర్ణ కఠోరమైన శబ్దంతో తీవ్ర శబ్ద కాలుష్యానికి కారణమవుతున్నారు. రంగంలోకి దిగిన పోలీసులు ఇన్నాళ్లకు మళ్లీ తమ కొరడా ఝుళిపించారు.



సంగారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద రోడ్డు రోలర్‌తో బైక్ సైలెన్సర్లను ధ్వంసం చేయిస్తున్న పోలీసులు

పోలీసుల ఉక్కుపాదం

● సంగారెడ్డి, పటాన్‌చెరులో 260 సైలెన్సర్ల ధ్వంసం

సంగారెడ్డి క్రైం/పటాన్‌చెరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా సంగారెడ్డిలో డీఎస్పీ సత్తయ్యగౌడ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి అధిక శబ్దం వచ్చే బైక్ సైలెన్సర్లను తొలగించారు. గురువారం సంగారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద 106 బైక్ సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గ వ్యాప్తంగా కూడా నాలుగు రోజులుగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా అమర్చుకున్న 154 మోటారు సైకిళ్ల సైలెన్సర్లను స్వాధీనం చేసుకుని, రోలర్‌తో ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సత్తయ్యగౌడ్ మాట్లాడుతూ, అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పటాన్‌చెరులో బైక్ సైలెన్సర్‌లను ధ్వంసం చేయిస్తున్న పోలీసులు

బైక్ సైలెన్సర్ల మార్పిడితో శబ్ద కాలుష్యం

ఆకతాయి యువత ఆగడాలు

కొరడా ఝుళిపించిన పోలీసులు... సైలెన్సర్ల ధ్వంసం

మూన్నాళ్ల ముచ్చటగానే ఈ చర్యలు

మళ్లీ యథావిధిగా మోత మోగిస్తే ఎలా?

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని పాతబస్టాండ్ నుంచి పోతిరెడ్డిపల్లి వరకు సాధారణ రోజుల్లో ఉదయం నుంచి రాత్రి వరకు విపరీతమైన రద్దీ ఉంటుంది. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో పాఠశాలలు, కాలేజీలు వదలడంతో విద్యార్థులు, ఉద్యోగులు తమ ఇళ్లకు వెళ్తుంటారు. ఈ సమయంలో కొందరు యువకులు సైలెన్సర్లు మార్చిన మోటార్ వాహనాలపై అతివేగంగా వెళ్తూ పక్కన వెళ్తున్న వారికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు. దాదాపు అర కిలోమీటరు దూరం వరకు ఆ శబ్దం వినిపిస్తూనే ఉంటుంది. కర్ణ కఠోరంగా వినిపించే ఈ శబ్దం కారణంగా పక్కన వెళ్తున్న వాహనచోదకులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ ఆకతాయిలను పట్టుకునే లోపే బైక్‌లపై అతివేగంగా దూసుకుపోతున్నారు. ముఖ్యంగా రాత్రి పది గంటల తర్వాత ఇలాంటి వాహనాలను నడుపుతూ రోడ్లపై యమ స్పీడ్‌గా వెళ్తున్నారు. పెద్ద శబ్దంతో బైక్‌పై వెళ్లడం నేటి యువతకు ఫ్యాషన్‌గా మారి శబ్ద కాలుష్యానికి కారకులవుతున్నారు.

ట్రాఫిక్ పోలీసుల ముందు నుంచే...

విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులు సౌండ్ మోతతో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను దాటిపోతున్న బైకర్లను నియంత్రించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా ఎస్పీ కార్యాలయం, ఆర్‌అండ్‌బీ భవనం, పోతిరెడ్డిపల్లి చౌరస్తాలతో పాటు ప్రధాన కూడళ్లలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసుల కళ్ల ముందు నుంచే ఈ ఆగడాలు సాగుతున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు ఆకతాయి యువకుల ఆటకట్టించేందుకు సిద్ధమయ్యారు. సంగారెడ్డి, పటాన్‌చెరులో బైక్‌లకు సైలెన్సర్లు మార్పిడి చేసి, అధిక శబ్దం చేస్తున్న వాహనాలపై గురువారం చర్యలకు ఉపక్రమించారు. రోడ్డు రోలర్‌తో సైలెన్సర్లను ధ్వంసం చేయించారు.

కేసుల నమోదుతోనే చెక్

పెద్ద శబ్దంతో బైక్‌పై రయ్ రయ్ మంటూ వెళ్లడం నేటి యువతకు ఫ్యాషన్‌గా మారిపోయింది. ఈ కారణంగా బైక్ సైలెన్సర్లను మార్పించి శబ్ద కాలుష్యానికి కారకులవుతున్నారు. మోటార్ బైక్‌లకు సైలెన్సర్లను మార్పిడి చేసే మెకానిక్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని గతంలో పోలీసులు హెచ్చరించారు. కానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో బైక్ ఆకతాయిల ఆగడాలకు అంతులేకుండా పోతోంది. స్పెషల్ డ్రైవ్ ద్వారా అధిక శబ్దం చేసే బైక్ సైలెన్సలర్లను గుర్తించి, వాటిని ధ్వంసం చేయించినప్పటికీ ఇది మూన్నాళ్ల ముచ్చటగానే మారుతుంది. పది రోజులు, లేదా నెల వరకు ఎలాంటి మార్పిడులు చేయకుండా ఉంటారేమో, మళ్లీ ఆకతాయి యువకులు యథావిధిగా మోత మోగిస్తూనే ఉంటారు. కేసుల నమోదుతోనే ఈ సమస్యకు చెక్ పెట్టే అవకాశం ఉన్నది.

సైలెన్సర్లు మార్పిడి చేస్తే కఠిన చర్యలు



సంగారెడ్డి పట్టణంలో కొందరు యువకులు తమ బైక్‌లకు సైలెన్సర్లు మార్పిడి చేసి అధిక శబ్దం వచ్చే విధంగా చేస్తున్నారు. దీన్ని అరికట్టేందుకు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశాం. అధిక శబ్దం వచ్చే బైక్‌ల సైలెన్సర్లు తొలగిస్తాం. ఎవరైనా సైలెన్సర్లు మార్పిడి చేస్తే కేసులు నమోదు చేస్తాం. అలాగే సైలెన్సర్లు మార్పిడి చేసే మెకానిక్‌లపై చర్యలు తీసుకుంటాం.

- రామకృష్ణారెడ్డి, ట్రాఫిక్ సీఐ, సంగారెడ్డి

80 డెసిబెల్స్ దాటితే ప్రమాదమే



సాధారణంగా చెవులకు ప్రమాదం లేకుండా వినదగే శబ్దం స్థాయి 60 డెసిబెల్స్ వరకు సురక్షితంగా వుంటుంది. శబ్దం స్థాయి 80 డెసిబెల్స్ దాటితే చెవులకు తీవ్ర ప్రభావం ఉంటుంది. సాధారణ సంభాషణ, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ 60 డెసిబెల్స్ లోపు ఉంటుంది. ఈ శబ్దం దీర్ఘకాలం విన్నా ఎలాంటి నష్టం ఉండదు. మోటార్ సైకిల్, హెవీ మిషన్ల శబ్దం 85 డెసిబెల్స్ స్థాయి వరకు ఉంటుంది. టపాసులు పేల్చడం ద్వారా వచ్చే శబ్దం 100 డెసిబెల్స్ ఉంటుంది. మోటార్ బైక్ సైలెన్సర్ మార్పిడి ద్వారా వచ్చే శబ్దం స్థాయి దాదాపు 120 డెసిబెల్స్ వరకు ఉంటుంది. ఇలాంటి శబ్దాలు ఎక్కువ సేపు వింటే చెవులు వినికిడిని శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం ఉంది.

- కె.పరమేశ్వర్, ఈఎన్‌టీ వైద్యుడు, సంగారెడ్డి





క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పంకజ్, ఎంపీ రఘునందన్, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి తదితరులు, లంబాడీ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అట్టహాసంగా రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు

క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించిన ప్రజాప్రతినిధులు, కలెక్టర్

పటాన్‌చెరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరులోని మైత్రి మైదానంలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 69వ రాష్ట్రస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలకు శ్రీకారం చుట్టారు. ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్ పోటీలను ప్రారంభించారు. 33 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్ పాస్ట్‌ను నిర్వహించారు. విద్యార్థులు తీసుకువచ్చిన కాగడాతో క్రీడాజ్యోతిని వెలిగించి, వాలీబాల్, కబడ్డీ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయంగా దేశ క్రీడాకారుల సంఖ్య తగ్గుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటలకు సమయాన్ని కేటాయించాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక కోటాను అమలు చేస్తోందని తెలిపారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ 150 కోట్ల మంది ఉన్న దేశంలో క్రీడాకారుల ప్రాతినిధ్యం స్వల్పంగా ఉందన్నారు. ఒలింపిక్ క్రీడల్లో దేశ విజయాల సంఖ్య పెరగాలంటే విద్యార్థి దశ నుంచే క్రీడలకు ప్రాధాన్యత పెరగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని క్రీడలకు నిలయంగా మారుస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో మైదానాల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందని చెప్పారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు?

● నర్సాపూర్ కోమటికుంట సుందరీకరణకు నిధుల కేటాయింపు
● మున్సిపల్ శాఖ ద్వారా రూ.1.20 కోట్లు మంజూరు
● మురుగు, చెత్తతో డంపుయార్డును తలపిస్తున్న కుంట
● పాలకవర్గం లేదు.. అధికారులు పనులు చేసేనా?...

స్థానికుల ఆశలు నెరవేరేనా?



నర్సాపూర్ కోమటి కుంట కట్టపై ఇష్టానుసారంగా పడేసిన వ్యర్థాలు

నర్సాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రోజురోజుకు విస్తరిస్తూ వేగంగా అభివృద్ధి చెందుతున్న నర్సాపూర్ పట్టణానికి ఆనుకుని ఉన్న కోమటికుంట గతంలో స్వచ్ఛమైన నీటితో కళకళలాడుతూ పొలాలకు నీరందించేది. అయితే పట్టణీకరణ పెరగడంతో, పెద్దఎత్తున నిర్మాణాలు జరగడంతో కుంట ఇళ్లకు అతి దగ్గరైంది. దీంతో ప్రస్తుతం ఈ కుంట మురుగునీరు, చెత్తచెదారంతో డంపుయార్డును తలపిస్తోంది. పట్టణానికి అత్యంత సమీపంలో ఉన్న ఈ కుంటను సుందరీకరించి, ప్రజలకు ఆహ్లాదకర వాతావరణంలో సేద తీరడానికి, వాకింగ్ చేసుకోవడానికి అనువుగా తీర్చిదిద్దాలని స్థానికులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. ఎట్టకేలకు సుందరీకరణకు నిధులు మంజూరయ్యాయి.

మురుగు, చెత్తతో అధ్వానం

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సుందరీకరణకు నిధులు తెస్తానని హామీ ఇచ్చి, ప్రతిపాదనలు కూడా సిద్ధం చేయించినా ఆ ప్రయత్నం కార్యరూపం దాల్చలేదు. సుందరీకరణ పనులు ఆలస్యం కావడంతో కోమటికుంట కట్టపై స్థానికులు చెత్త వేయడం మొదలుపెట్టారు. దీంతో కోమటికుంట డంపుయార్డులా తయారైంది. అంతేకాక, సమీపంలోని ఇళ్ల నుంచి మురుగునీరు పెద్ద ఎత్తున వచ్చి కుంటలోకి చేరడంతో నీటి రంగు మారి కలుషితమైంది. గతంలో కలెక్టర్ పట్టణంలో పర్యటించినప్పుడు ఈ కుంటను సందర్శించి, నీటిలో పడేలా ఉన్న చెత్తను చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే చెత్తను తొలగించి, శుభ్రం చేయాలని అప్పటి మున్సిపల్ అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు కొంతకాలం చెత్తను తొలగించి, సమీపంలోని వారు చెత్త వేయకుండా చర్యలు తీసుకున్నారు. అయితే, తిరిగి పర్యవేక్షణ కొరవడటంతో సమీపంలోని వ్యాపారులు, ఇళ్లలోని వారు ఇష్టానుసారంగా చెత్తతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను పెద్ద ఎత్తున వేస్తున్నారు. దీంతో వ్యర్థాలు నీటిలో కలిసి, నీరంతా పూర్తిగా కలుషితమవుతోంది. కలెక్టర్ సందర్శించిన సమయంలో చెత్త వేసేవారిని గుర్తించి జరిమానా విధించాలని సూచించినా, అటువంటి చర్యలు లేకపోవడంతో వ్యర్థాలు వేయడంతో పరిస్థితి దారుణంగా మారుతోంది.

సుందరీకరణకు నిధులు

ఎన్నో రోజులుగా కోమటికుంట సుందరీకరణ చేయాలని ఎదురుచూస్తున్న స్థానిక ప్రజల కల ఎట్టకేలకు నెరవేరనుంది. ప్రభుత్వం నుంచి ఇటీవల పట్టణ అభివృద్ధికి మున్సిపల్ శాఖ ద్వారా నిధులు మంజూరు కాగా, అందులో కోటి 20 లక్షల రూపాయలు కోమటికుంట సుందరీకరణకు కేటాయించారు. దీంతో వ్యర్థాలు, మురుగునీటితో దారుణంగా తయారైన కుంట రూపురేఖలు మారే అవకాశం ఉందని స్థానికుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. అయితే, ప్రస్తుతం పాలకవర్గం లేకపోవడంతో పనులు ఎప్పటిలోగా ప్రారంభిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు చొరవ తీసుకుని ఈ పనులను త్వరగా ప్రారంభించాల్సిన అవసరం ఉంది. ముందుగా కుంటలోకి వస్తున్న మురుగునీరు రాకుండా చేసి, వ్యర్థాలు వేయకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

పౌష్టికాహారంతో ఆరోగ్యం సమతుల్యం



పౌష్టికాహార ఉత్పత్తుల ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య

పటాన్‌చెరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారంతో ఆరోగ్యం సమతుల్యంగా ఉంటుందని, గర్భిణులు తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. గురువారం పటాన్‌చెరు మున్నూరు కాపు భవనంలో అంగన్‌వాడీ పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. 250 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు, 50 చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాలను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులకు ప్రత్యేకంగా ఆహారాన్ని ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ రీజినల్ డైరెక్టర్ మోతి, జిల్లా అధికారి లలిత కుమారి, కార్పొరేటర్లు మెట్టుకుమార్‌యాదవ్, పుష్పానగేష్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం, పోలీసు ఫ్లాగ్‌డేను పురస్కరించుకుని జిల్లాలోని ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లకు, ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలను నిర్వహించనున్నట్లు సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 21 నుంచి 31వరకు నిర్వహించే వారోత్సవాల్లో భాగంగా అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించే అంశాలకు సంబంధించి గత సంవత్సరం అక్టోబరు నుంచి ఈ ఏడాది అక్టోబరు వరకు తీసిన మూడు ఫొటోలు, తక్కువ నిడివి గల మూడు నిమిషాల గల షార్ట్‌ఫిల్మ్ లోడ్ చేసిన పెన్ డ్రైవ్‌ను రాష్ట్రస్థాయి పోటీల కోసం 22వ తేదీలోపు పంపించాలని జిల్లా పోలీసు కార్యాలయంలో పీఆర్వోకు అందజేయాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 8712539040కు సంప్రదించాలని కోరారు.

దౌల్తాబాద్‌కు దళారులే దిక్కా?

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయని సర్కార్

- ప్రైవేట్‌లో విక్రయించి మోసపోతున్న రైతులు
- క్వింటాలుకు రూ.600 వరకు నష్టం
- ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని వేడుకోలు

దౌల్తాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్నను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రం లేక దౌల్తాబాద్ మండల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దౌల్తాబాద్ మండలంలో ఎన్నో ఏళ్లుగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రం లేకపోవడంతో, రైతులు తమ పంటను ప్రైవేట్ వ్యాపారులకు అతి తక్కువ ధరకు అమ్ముకొని ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


దౌల్తాబాద్ : సూరంపల్లిలో ఆరబోసిన మొక్కజొన్న ధాన్యం

ప్రభుత్వాలు మారినా.. మార్కెట్ రాలేదు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాలన మొదలుకొని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా దౌల్తాబాద్ మండలానికి మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు కాలేదు. ప్రజాప్రతినిధులు ఈ విషయంలో విఫలమయ్యారని రైతులు మండిపడుతున్నారు.

దౌల్తాబాద్ మండలంలో మొత్తం 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇక్కడ అత్యధిక కుటుంబాలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. ముఖ్యంగా వానకాలం, యాసంగి సీజన్లలో పెద్ద ఎత్తున మొక్కజొన్న పంట సాగు చేస్తారు. ఇంత పెద్ద మండలానికి కొనుగోలు కేంద్రం లేకపోవడంతో, పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక, దళారుల చేతిలో మోసపోతున్నామని రైతులు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి దౌల్తాబాద్‌లో మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మార్కెట్ అందుబాటులో ఉంటే..

ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.2400 ఉండగా, అందుబాటులో మార్కెట్ లేక ప్రైవేట్ వ్యాపారులు కేవలం రూ.1800 లేదా రూ.1900 ధరకే కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఒక్కో క్వింటాలుకు రైతు రూ.500 నుంచి రూ.600 వరకు ఆర్థికంగా నష్టపోతున్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలో గానీ, దొమ్మాట సెంటర్‌లో కానీ మార్కెట్ అందుబాటులో ఉంటే తమకు మద్దతు ధర దక్కేదని రైతులు వాపోతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



దౌల్తాబాద్, దొమ్మాట రెండు గ్రామాలలో రైతులకు అందుబాటులో ఉండే విధంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. లేదంటే ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది. మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను.

-నలుక నరసింహులు, రైతు, తిర్మలాపూర్

ఆరబెట్టడం కష్టంగా మారింది



మొక్కజొన్నలు ఆరబెట్టడం రోజురోజుకీ కష్టంగా మారుతోంది. వర్షానికి మొక్కజొన్నలు తడిసి ముద్దవుతుండడంతో మళ్లీ మళ్లీ ఆరబెట్టడం కష్టంగా మారింది. పండించడం ఒక ఎత్తు అయితే, వాటిని అమ్ముకోవడం పెద్ద సమస్యగా మారింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి దౌల్తాబాద్‌లో కానీ, దొమ్మాటలో కానీ, కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

- శ్రీకాంత గౌడ్, రైతు, దొమ్మాట

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- తొగుట సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి

తొగుట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల'ని తొగుట కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం తొగుటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆరుగాలం కష్టించి పండించిన మొక్కజొన్నలను విక్రయించడానికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, లేని పక్షంలో రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ యాదగిరి, నాయకులు మల్లారెడ్డి, రమేశ్, స్వామి, వెంకటరెడ్డి, ఐలయ్య, అరుణ్‌కుమార్, ఎల్లం, నరేందర్‌గౌడ్, శ్రీనివాస్, అశోక్, మధుసూదన్‌రెడ్డి, ప్రకాష్, భైరారెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, కర్ణాకర్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు బీజేపీ వినతి

అక్కన్నపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీజేపీ మండల శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం అక్కన్నపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మధుసూదన్‌కు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు రామంచ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులకు తక్కువ ధరకు విక్రయించి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి చెరుకు సంపత్, గిరిజన మోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు నూనావత్ మోహన్ నాయక్, యువ మోర్చా మండల అధ్యక్షులు సలేంద్ర తిరుపతి యాదవ్, వేణుగోపాలరావు, నరేష్, పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

జైలుశిక్ష, జరిమానా

గజ్వేల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 27 మందికి రూ. 37,500 జరిమానా, ముగ్గురు వ్యక్తులకు ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి మూల స్వాతి గౌడ్ తీర్పు వెలువరించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం. మురళీ తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని వివిధ కూడళ్లలో ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ టెస్టుల్లో పట్టుబడిన పలువురిని గురువారం కోర్టులో హాజరుపరచగా, విచారించిన న్యాయమూర్తి ఈ తీర్పును ఇచ్చారని తెలిపారు.

బాధిత కుటుంబానికి ప్రతాప్‌రెడ్డి పరామర్శ

గజ్వేల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీ, ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ దామరంచ ప్రతాప్‌రెడ్డిని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి వంటేరు ప్రతాపరెడ్డి పరామర్శించారు. ప్రతాపరెడ్డి తల్లి దామరంచ అంజమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన వారి కుటుంబాన్ని పరామర్శించి, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు నవాజ్‌మీరా, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, నాయకులు విరాసత అలీ, మాజీ ఎంపీటీసీ మల్లేశం, మాజీ ఉప సర్పంచ్ బాలకిషన్, నాయకులు పాల రమేశ్‌గౌడ్, నరేశ్, కనకయ్య తదితరులు ఉన్నారు.

గ్రామపాలన అధికారుల మండల కమిటీ ఎన్నిక

తొగుట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామపాలన అధికారుల తొగుట మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షుడిగా ఆరుట్ల బాలయ్యను ఎన్నుకోగా, ఉపాధ్యక్షులుగా మల్యాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా వంగ కల్పన, సహాయ కార్యదర్శిగా రాసమల్ల నవీన్, కోశాధికారిగా జి. కృష్ణ ఎన్నికయ్యారు. సలహాదారులుగా మద్దెల కమలాకర్, వినోద, సుజాత, వెంకటేశంలను ఎన్నుకున్నారు.

'మృతుని కుటుంబాన్ని ఆదుకుంటాం'

ములుగు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మృతి చెందిన కామటి బాలయ్య కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ జహంగీర్ అన్నారు. గురువారం ఆయన వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. వారి కుటుంబానికి తాము అండగా నిలిచి ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట మైనార్టీ యూత్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జుబేర్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, కనకయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

బిగ్‌బాస్‌ను నిషేధించాలి: బీజేపీ


ఫిర్యాదు చేస్తున్న కమ్మరి శ్రీను

గజ్వేల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బిగ్‌బాస్ షోను నిషేధించాలని బీజేపీ నాయకుడు కమ్మరి శ్రీను డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణానికి చెందిన కమ్మరి శ్రీను ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బిగ్‌బాస్ షో ద్వారా సమాజం పెడదారి పడుతోందని, ముఖ్యంగా యువత ఈ షోకు ఆకర్షితులై చదువుపై శ్రద్ధ లేకుండా తమ ఉజ్వల భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజం తలవంచుకునే రీతిలో బిగ్‌బాస్ షో నిర్వహించడం బాధాకరమన్నారు. కర్ణాటకలో ఈ షోను నిషేధించిన విధంగా తెలంగాణలోనూ నిషేధించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిగ్‌బాస్ హౌస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

బద్దిపడగ హైస్కూల్ హెచ్‌ఎం సస్పెండ్ రద్దు చేయాలి: డీటీఎఫ్

నంగునూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బద్దిపడగ జడ్పీహెచ్ఎస్ పాఠశాల హెచ్‌ఎం పద్మను సస్పెండ్ చేయడాన్ని డీటీఎఫ్ సిద్దిపేట జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి కిష్టయ్య అన్నారు. గురువారం నంగునూరులో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, పాఠశాల పరిశుభ్రత కోసం కేటాయించిన స్కావెంజర్లకు, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సరైన వేతనాలు ఇవ్వకుండా, వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకోకుండా, 'వంట బాగా లేదు, మెనూ ప్రకారం పెట్టలేదు' అంటూ హెచ్‌ఎంను జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సస్పెండ్ చేయడం సరికాదన్నారు. పాఠశాల హెచ్‌ఎంపై మోపిన నిరాధార ఆరోపణలను వెనక్కి తీసుకొని, సస్పెన్షన్‌ను రద్దు చేసి, తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని వివిధ పాఠశాలల్లో యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. సమావేశంలో డీటీఎఫ్ జిల్లా కార్యదర్శులు మనీష్‌కుమార్, డి. మల్లయ్య, నాయకులు జి. సత్తయ్య, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవికి నాయిని యాదగిరి దరఖాస్తు



గజ్వేల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి కోసం టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాయిని యాదగిరి దరఖాస్తు చేశారు.. జిల్లా ఇన్‌చార్జి జ్యోతి రౌటేలాకు ఈ మేరకు దరఖాస్తు పారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా కష్టపడి పనిచేస్తున్నానని, ఎన్నో కేసులను ఎదుర్కొన్నానని, నాయకత్వం ఇచ్చిన ప్రతి బాధ్యతను ఎంతో విజ్ఞతతో నిర్వహించానని తెలిపారు. తనకు డీసీసీ అధ్యక్ష పీఠం ఇస్తే పార్టీని అభివృద్ధి వైపు నడిపిస్తానని హామీ ఇచ్చారు. తాను బీసీనని, బీసీ వర్గానికి అధ్యక్ష పీఠం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయండి

- బీసీ కుల సంఘాల నాయకులు

గజ్వేల్ రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల కోసం ఈ నెల 18న జరగనున్న రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని బీసీ కుల సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం గజ్వేల్ ప్రెస్ క్లబ్‌లో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఏర్పాటు కోసం సమావేశం నిర్వహించారు. అనంతరం సంఘ నాయకులు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ఈ బంద్‌ను సక్సెస్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కళ్యాణ్ కార్ నరసింహారావు, మరికంటి కనకయ్య ముదిరాజ్, గుంటుకు శీను ముదిరాజ్, గడియారం స్వామిచారి, సందబోయిన ఎల్లం, ముత్యాల విఠలాచారి, నాగపురి బాబు, బండ్ల స్వామి, కుమ్మరి పోచయ్య సుధాకర్, కొమ్ము నరేష్ యాదవ్, దండే యాదగిరి, కుమ్మరి యాదగిరి, రామ్మూరి శ్రీధర్, చిక్కుడు ప్రసాద్ ముదిరాజ్, కానుగుల రమణాకర్ తదితరులు పాల్గొన్నారు.


గజ్వేల్ రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కుల సంఘం నాయకులు

- హుస్నాబాద్ : రాష్ట్ర బంద్‌కు హుస్నాబాద్ జేఏసీ, ఎంఆర్‌పీఎస్ నాయకులు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. గురువారం హుస్నాబాద్ పట్టణంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మెజారిటీ ఉన్న బీసీ కులాలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చి సామాజిక న్యాయం పాటించాలన్నారు. సమావేశంలో జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, కో ఆర్డినేటర్ డ్యాగల సారయ్య పాల్గొన్నారు.
- సిద్దిపేట అర్బన్ : జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఆవరణలో గురువారం బీసీ, ఎస్సీ, ఎస్టీ కుల సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయా కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ... బీసీ రిజర్వేషన్ మా హక్కు అని, వాటిని ఇవ్వకుంటే సిద్దిపేట అంటే పోరాటాల గడ్డ అని నిరూపిస్తూ పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని బీసీ నాయకులు తెలిపారు. పార్టీలకు అతీతంగా రాష్ట్ర బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

- ట్రాఫిక్ సీఐ మురళీ

గజ్వేల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపవద్దని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం. మురళీ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో గల కౌన్సిలింగ్ కేంద్రంలో ఆయన 25 మంది మద్యం సేవించిన డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మద్యం సేవించి వాహనాలు నడపడం వలన ప్రమాదం జరిగితే కుటుంబానికి తీరని నష్టం వాటిల్లుతుందని, కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడపాలని సూచించారు. ఆయనవెంట ఏఎస్ఐ జగదీశ్వర్, సిబ్బంది ఉన్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

గజ్వేల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, ట్రాఫిక్ సీఐ మురళీ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని గీతాంజలి జూనియర్ కళాశాల విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, నూతన చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు.

ఒక్కటయ్యారు.. బస్టాండ్‌ను శుభ్రం చేశారు..

దౌల్తాబాద్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన యువకుల శ్రమదానం ఎంతో మందికి ఆదర్శంగా నిలిచింది. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ భవనం పక్కన, చేగుంట రోడ్డులో లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్ ఏళ్లుగా వినియోగంలో లేక, చెత్తాచెదారంతో పూర్తిగా నిండిపోయింది. బస్సులు లోపలికి రాకపోవడంతో ప్రయాణికులు కూర్చోలేకపోయేవారు. ఇటీవల, దౌల్తాబాద్ బస్టాండ్‌లోకి బస్సులు రావాలని, ప్రయాణికులు బస్టాండ్‌లోనే బస్సులు ఎక్కాలని కోరుతూ గజ్వేల్ డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో బస్టాండ్‌లోకి బస్సులు, ప్రయాణికులు రావడం ప్రారంభమై, కొత్త శోభ సంతరించుకుంది. అయితే, బస్టాండ్‌లో చెత్తాచెదారం, దుమ్ము, ధూళితో నిండి ఉండడాన్ని గమనించిన దౌల్తాబాద్ గ్రామ యువకులు గురువారం చేయి చేయి కలిపి చీపురులతో చెత్తాచెదారాన్ని తొలగించి, నీళ్లతో కడిగి పరిశుభ్రంగా చేశారు. బస్టాండ్‌ను శుభ్రం చేసిన ఈ యువకులను గ్రామస్థులు, ప్రయాణికులు అభినందించారు.


బస్టాండ్‌ను శుభ్రం చేస్తున్న యువకులు

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల 'స్వచ్ఛభారత్'



వర్గల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ డా. బీఆర్ అంబేద్కర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గురువారం వర్గల్‌లోని విద్యా సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం క్షేత్రం ప్రాంగణంలోని పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ స్వప్న నూనె, ఫిజికల్ డైరక్టర్ డాక్టర్ పాండు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


పాటల ద్వారా అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మిరుదొడ్డి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక కళాకారుల దుబ్బాక నియోజకవర్గ టీం లీడర్ రవి అన్నారు. గురువారం మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై, యువత డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన కల్పించారు కళాకారులు రవీందర్, ఎల్లయ్య, రవీందర్, తిరుమలయ్య, క్రాంతికుమార్, జింక దేవదాస్ తదితరులున్నారు.

స్థానిక పోషకాహార పదార్థాలను ప్రోత్సహించాలి

- దుబ్బాక సీడీపీవో ఎల్లయ్య


దౌల్తాబాద్: మాట్లాడుతున్న దుబ్బాక సీడీపీవో ఎల్లయ్య

దౌల్తాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉత్పత్తుల ఆహార పదార్థాల వినియోగాన్ని ప్రోత్సహించి, ప్రతి ఒక్కరూ అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక సీడీపీవో ఎల్లయ్య అన్నారు. గురువారం ఇండస్ట్రియాల్ సెక్టార్ అంగన్వాడీ కేంద్రంలో దుబ్బాక ప్రాజెక్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ ఆధ్వర్యంలో పోషణ్ మాసం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీడీపీవో మాట్లాడుతూ... అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా అందిస్తున్న గర్భిణీలకు, బాలింతలకు ఒక పూట సంపూర్ణ భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ, పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ శ్యామ్ సన్, ఏఎన్ఎం స్వరూప, మెడికల్ స్టాఫ్ మమత, గ్రామ అంగన్వాడీ టీచర్లు మంజుల, సువర్ణ, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

- మిరుదొడ్డి : మండలంలోని చెప్యాల అంగన్వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో ఎల్లయ్య, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన డీఈవో


విద్యార్థుల పఠనాన్ని పరిశీలిస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

చేర్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం గుర్జకుంట జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక, దొమ్మాట ప్రాథమిక పాఠశాలలను సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల హాజరుశాతం, మధ్యాహ్న భోజనం తయారీని పరిశీలించారు. ఫేస్ రికగ్నైజేషన్ పద్ధతిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు 100 శాతం హాజరు తీసుకోవాలని ఆయన సూచించారు. టీచర్ లెర్నింగ్ మెటీరియల్‌తో పాటు ఐఎఫ్‌పీ ప్యానెల్ వినియోగంతో పాఠ్యబోధన జరపాలని, విద్యార్థులు ధారాళంగా చదవడం, రాయడం కలిగి ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు ప్రతీ నిత్యం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవని తెలిపారు. ఆయనవెంట సీఆర్‌పీ జె. కనకరాజు ఉన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

- పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో మెనూ విధిగా పాటించాలని పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ అన్నారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా భోజనం గురించి, పాఠశాలలో విద్యాబోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న శ్రీనివాస్

పస్తుల్లో 'పండుటాకులు'

(3వ పేజీ తరువాయి)

వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం -2007ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడితే.. తెలంగాణ ప్రభుత్వం సవరణ నియమావళి-2022ను రూపొందించింది.

వృద్ధులు తమ సమస్యలను ఇలా తెలపొచ్చు..

60 ఏళ్ల దాటిన వృద్ధులు ఇబ్బందులకు గురైతే రెవెన్యూ అధికారులను ఆశ్రయించవచ్చు. తెల్ల కాగితంపై సమస్యను రాసి ఇస్తే ఆర్డీవో చైర్మన్‌గా ఉన్న ట్రిబ్యునల్‌కు అందజేయాలి. ఆర్డీవో క్షేత్రస్థాయిలో పరిశీలన, తనిఖీ, కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం 90 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తారు. పరిస్థితి తీవ్రతను బట్టి శిక్షలను విధిస్తారు. గిఫ్ట్ డీడ్‌లు చేస్తే రద్దు చేయడం, బాధితులకు జీవనభృతి ఇచ్చే ఏర్పాట్లు చేస్తారు. రక్షణ సౌకర్యాన్ని కల్పిస్తారు. ఈ ప్రక్రియకు ఎలాంటి రుసుము ఉండదు. గజ్వేల్‌లో 50, హుస్నాబాద్‌లో 55 అర్జీలు ఉండగా, సిద్దిపేటలో దాదాపుగా70 వరకు ఉన్నాయని, ప్రతి వారంలో పది వరకు అర్జీలు వస్తుంటాయని అధికారులు తెలిపారు.

సంక్షేమ చట్టం-2007పై కానరాని అవగాహన

వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం-2007పై అవగాహన లోపించింది. బాధితుల్లో కొద్దిమంది మాత్రమే ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తున్నారు. అయితే ఆర్డీవోల నిర్లక్ష్యం వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమస్యలుంటే వృద్ధులు హెల్ప్‌లైన్ నెంబర్ 14567ను సైతం సంప్రదించవచ్చు. న్యాయస్థానాలతో సంబంధం లేకుండా తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం-2007అండగా నిలుస్తుంది. ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే రూ.10వేల ఆర్థిక సాయం ఇప్పించి బాధ్యులపై చర్యలు తీసుకుంటారు. గిఫ్ట్ డీడ్ ఉంటే రద్దు చేయడం చేస్తారు. ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసేటప్పుడే పోషణ, సంరక్షణ చూడకపోతే వెనక్కి తీసుకుంటామనే నిబంధన ఉందని అధికారులు చెబుతున్నారు. కాగా, ఈ చట్టంపై అవగాహన కల్పించడంలో ఆసక్తి కనబరచడం లేదు.